

ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

చింతకొమ్మదిన్నె మండల పరిధిలో ఎర్రచందనాన్ని ఆటోలో లోడింగ్ చేస్తున్న 11 మంది స్మగ్లర్లను అరెస్ట్ చేశామని కడప ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కె. ప్రసాద్ తెలిపారు. - 8లో



నిందితులకు జెలిటిన్ స్టిక్స్ ఎక్కడివో.?

వి.కొత్తపల్లెలో వీఆర్ఏ నరసింహులును హత్య చేసేందుకు ఉపయోగించిన జెలిటిన్ స్టిక్స్ ఎక్కడ నుంచి వచ్చాయోనని పోలీసులు ఆరా తీస్తున్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం

26.8 /33.5

వాతావరణం

జిల్లాలో సోమవారం 26.8 - 33.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

హౌసింగ్ పీడీగా రాజారత్నం



హౌసింగ్ పీడీ రాజారత్నంకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న కార్యాలయ సిబ్బంది

కడప సిటీ : జిల్లా గృహ నిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌గా వి.రాజారత్నంను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సోమవారం ఆయన కడపలోని తన కార్యాలయానికి చేరుకుని బాధ్యతలు చేపట్టారు. ఇదిలా ఉండగా రాజారత్నం గతంలో జిల్లాలోని బద్వేలు, పులివెందులలో పనిచేశారు. కాగా ఇప్పటి వరకు పీడీగా పనిచేస్తున్న కృష్ణయ్యను విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కార్యాలయ అధికారులు, ఉద్యోగులు నూతన పీడీ రాజారత్నంను కలిసి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ప్రేమ్ దాస్, ఆది, చిన్నయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలను వినియోగించుకోవాలి



పాఠ్యపుస్తకాలు అందుకున్న విద్యార్థులతో పాఠ్యపుస్తక మేనేజర్ రామాంజనాదేవి

కడప ఎడ్యుకేషన్ : సెమిస్టర్–2 పాఠ్యపుస్తకాలు అన్ని పాఠశాలలకు అందచేశామని, వాటిని విద్యార్థులు వినియోగించుకోవాలని పాఠ్యపుస్తక జిల్లా మేనేజర్ రామాంజనాదేవి తెలిపారు. సోమవారం కడపలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌తోపాటు జిల్లాలోని పలు పాఠశాలలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడి పాఠ్యపుస్తకాలు అందాయా లేదా అని విచారించారు.

నకిలీ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థలను నమ్మవద్దు

వైవీయూ : వైఎస్ఆర్ కడప జిల్లాలో నకిలీ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థలు అనధికారికంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం వచ్చిందని అలాంటి సంస్థలను నమ్మవద్దని జిల్లా విద్యాశాఖాధికారి ఎం. అనూరాధ తెలిపారు. ముఖ్యంగా హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆర్గనైజేషన్ (ఐహెచ్ఎస్‌జీఓ) తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మోసం చేస్తూ పాఠశాలల్లో కార్యకలాపాలను నిర్వహించే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిసిందన్నారు. ప్రపంచ స్కౌట్ ఉద్యమం(డబ్ల్యుఓఎస్ఎం), వరల్డ్ అసోసియేషన్ ఆఫ్ గర్ల్ గైడ్స్ అండ్ గర్ల్ స్కౌట్ (డబ్ల్యుజీజీఎస్) అనుబంధ సంస్థగా ఉన్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ మాత్రమే అనుమతించబడిన సంస్థ అని పేర్కొన్నారు. మరే ఇతర సంస్థలకు అనుమతి లేదని, ప్రభుత్వ అనుమతి లేకుండా సదరు అనుమతి లేని సంస్థలు ఏవైనా కార్యక్రమాలు చేపట్టినట్లయితే వాటిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రేపు బాస్కెట్ బాల్ ఎంపికలు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని జయనగర్ కాలనీ బాలికల ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఈనెల 2వ తేదీ ఉదయం 9 గంటలకు జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ సబ్‌జూనియర్ విభాగం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్. సహదేవరెడ్డి తెలిపారు. బాలబాలికలకు నిర్వహించే ఈ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలని సూచించారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు అక్టోబర్ 3వ వారంలో విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

కేజీబీవీలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బందిని క్రాంటాక్టు ప్రాతిపదికన, బోధనేతర సిబ్బందిని అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికను భర్తీ చేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ మర్రెడ్డి అనురాధ, సమగ్రశిక్ష జీసీడీవీ విజయలక్ష్మి సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులను 2024–25 విద్యా సంవత్సరానికి ఒక సంవత్సరం కాలానికి భర్తీ చేయనున్నామని, జిల్లాలోని అర్హులైన, ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇందులో పీజీటీ -3, పార్ట్ టైం టీచర్స్- 3, అకౌంటెంట్-2, వార్డన్ పోస్టు- 2 ఇలా మొత్తంగా 10 పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల మహిళా అభ్యర్థులు తమ ఆన్‌లైన్ దరఖాస్తులను apkfbv.apcfrr.in వెబ్‌సైట్ ద్వారా రూ. 250 దరఖాస్తు రుసుం చెల్లించి అక్టోబర్ 10వ తేదీ మధ్యాహ్నం 11.59 నిమిషాల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

వైఎస్ జగన్ హయాంలో

ఆలయం.. దేదీప్యమానం

వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంతో పాటు మన జిల్లాలోని ఆలయాలకు మహర్దశ చేకూరింది. ముఖ్యంగా జిల్లాలోని అన్ని ప్రాంతాలలో ఆలయాల జీర్ణోద్ధరణకు, అభివృద్ధికి నిధులు భారీగా మంజూరు చేశారు. గండి అంజన్న ఆలయం.. పొలతల.. బి.మఠం. ప్రొద్దుటూరులో వేదపాఠశాల, నారాపుర వెంకటేశ్వర ఆలయం.. పులివెందులలో పలు ఆలయాలకు రాజగోపురాల నిర్మాణం.. ఇలా ప్రముఖ ఆలయాలతో పాటు కొత్త దేవాలయాల నిర్మాణానికి నిధులు కేటాయించారు. చాలా ఆలయాలు నిర్మాణాలు పూర్తి చేసుకుని నూతన శోభను సంతరించుకున్నాయి. ఆలయ అభివృద్ధికి జగన్ పాలనలో చేసిన కృషికి జిల్లా వాసులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కడప కల్చరల్ : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలోని దేవాలయాలు దేవదాయ ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో కళకళలాడాయి. ఆలయంలో భక్తులకు సౌకర్యాలు కల్పించడంతోపాటు పాలన కోసం పటిష్టమైన పాలక మండళ్లు, వాటిలో అర్చకులు, బీసీలు, ఎస్సీ ఎస్టీలకు తగిన స్థానం కల్పించడం, ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకంగా వ్యవహరించడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

- 2007లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి దేవదాయశాఖ ఆధ్వర్యంలో 21 మందితో ధార్మిక పరిషత్‌ను ఏర్పాటు చేశారు. వార్షికంగా స్థిరమైన ఆదాయం లేని వేలాది దేవాలయాలలో నిత్య పూజల కోసం ధూప దీప నైవేద్యం పథకాన్ని ప్రవేశపెట్టారు. తొలి విడతగా 3500 ఆలయాలలో ఈ పథకాన్ని అమలు చేశారు. 2006లో తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో వేద విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు.
- 2008 జూన్‌లో శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్‌ను ప్రారంభించారు. అన్నమయ్య ఉత్సవాలను ఘనంగా నిర్వహించింది కూడా డాక్టర్ వైఎస్సార్ ఆధ్వర్యంలోనే. 2006లో పేద, మధ్య తరగతి కుటుంబాల్లో వివాహం చేసుకున్న ప్రతి జంటకు కల్యాణమస్తు పథకాన్ని వర్తింపజేశారు. అందులో భాగంగా వివాహం చేసుకునే జంటకు బంగారు మంగళసూత్రాలు, వెండి మెట్టెలు, నూతన వస్త్రాలు, తలంబ్రాలు, వివాహ సామాగ్రి, ఉచితంగా పురోహితుని ఏర్పాటు, 60 మంది బంధుమిత్రులకు ఉచితంగా వివాహ భోజనం ఏర్పాటు చేశారు. దళిత, గిరిజన గోవిందం పేరుతో ఆయా వర్గాల వాడలలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు.

వైఎస్ జగన్ పాలనలో..

వైఎస్ జగన్ పాలనలో ధూప దీప నైవేద్యాల కోసం ప్రభుత్వం 5338 దేవాలయాలకు ఆర్థికసాయం అందజేశారు. చంద్రబాబు కూల్చేసిన 30 దేవాలయాలను పునర్నిర్మించారు. సుమారు రూ. 350 కోట్లతో శ్రీవాణి ట్రస్టు ద్వారా 2635 నూతన ఆలయాలను నిర్మించారు. మరో 300 ఆలయాలకు మరమ్మతులు చేపట్టి జీర్ణోద్ధరణ చేశారు. అర్చకులకు రూ. 5 వేల నుంచి రూ. 10 వేలకు జీతభత్యాలను పెంచారు. ఆ తర్వాత రూ. 10 వేల నుంచి రూ. 15,625లకు పెంచారు. వంశపారంపర్య అర్చకులకు పదవీ విరమణ లేకుండా ఓపిక ఉన్నంత కాలం దైవానికి, ప్రజలకు సేవలు అందించే అవకాశం కల్పించారు.

- బాబు హయాంలో 1600 దేవాలయాలకు ధూప దీప నైవేద్యాన్ని పరిమితం చేయగా, జగన్ ప్రభుత్వ హయాంలో 5338 ఆలయాలలో అమలు చేశారు. ఏడాదికి రూ. 5 లక్షల్లోపు ఆదాయం గల దేవాలయాన్నింటికీ వంశపారంపర్య ధర్మకర్తలు, స్థానిక భక్తుల కమిటీలకు అప్పగిస్తూ జీఓ ఇచ్చారు.

కడప నగరంలో..

కడప నగరంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో 20 చిన్న, మధ్యతరగతి దేవాలయాలు ఉన్నాయి. వందకు పైగా ప్రైవేటు ఆలయాలు ఉన్నాయి. వీటిలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆలయాల్లోని అర్చకులకు గౌరవ వేతనం అందుతోంది. జగన్ ప్రభుత్వం గతేడాది ప్రవేశపెట్టిన మిరాసి (వంశపారంపర్య) అర్చక విధానం కడప నగరంలో పది మందికి వర్తిస్తోంది.



చక్రాయపేట : నిర్మాణంలో ఉన్న గండి వీరాంజనేయ స్వామి ఆలయం

గండి అంజన్నకు నిధుల హారతి

చక్రాయపేట : జగనన్న పాలనలో ఆలయాల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.26 కోట్లు మంజూరు చేశారు. ఎంతో చరిత్ర కలిగిన సురభి గ్రామం రెడ్డివారిపల్లె సమీపంలో ఉన్న సిద్దేశ్వర స్వామి ఆలయం పునర్నిర్మాణానికి రూ.50 లక్షలు, చిలేకాంపల్లె గ్రామంలోని మావి ల్లమ్మ దేవత ఆలయం పునర్నిర్మాణానికి రూ.50 లక్షలు, అద్దాలమర్రి గ్రామంలోని విశ్వేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.20 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఇందులో గండి ఆలయం పనులు సుమారు రూ.20 కోట్ల మేర జరిగాయి. మిగిలిన పనులు కూటమి ప్రభుత్వం వచ్చాక నత్తనడకన సాగుతున్నాయి. మిగిలిన ఆలయాల పనులు పూర్తయి భక్తులకు అందుబాటులోకి వచ్చాయి.

- చక్రాయపేటలోని శ్రీ వేంకటేశ్వర, రాచరాయ స్వామి ఆలయాలకు అనుసంధానంగా కళ్యాణ మండపం నిర్మాణానికి సుమారు రూ.కోటి మేర మంజూరు చేశారు. దీంతో కళ్యాణ మండపం పనులు పూర్తయి వివాహాలు కూడా జరుగుతున్నాయి. వీటితో పాటు మండలంలో చిన్న చిన్న ఆలయాలకు ప్రహరీలకు కూడా పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారు.

బి. మఠం.. అభివృద్ధి పథం..

చాపాడు : మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా గతంలో ఎన్నడూ లేని విధంగా గత ఐదేళ్లలో పలు దేవాలయాలు అభివృద్ధి చెందాయి. నియోజకవర్గంలో ఐదు మండలాల్లో వివిధ గ్రామాలలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సీజీఎఫ్ నిధుల కింద రూ.17.29 కోట్లతో దేవాలయాలను అభివృద్ధి చేయటంతో పాటు పునర్నిర్మించారు.

- మైదుకూరు మండలంలో రూ.2.50 కోట్లతో ఆలయాలను అభివృద్ధి చేయగా.. మండలంలోని వరదాయపల్లె లో కోదండరామస్వామి ఆలయ జీర్ణోద్ధరణను రూ.70 లక్షలతో చేపట్టారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎల్లంపల్లె వద్ద గల తిరుమల నాథ స్వామి ఆలయానికి రూ.1.10 కోట్లతో బీటీ నిర్మాణం చేపట్టారు. బసవాపురంలో రూ.20 లక్షలతో రామాలయాన్ని అభివృద్ధి చేశారు. అట్లూరు కొత్తపల్లె శివాలయాన్ని రూ.50 లక్షలతో అభివృద్ధి చేశారు.
- చాపాడు మండలంలో ద్వారకానగరం, రేపల్లె, నెర్రవాడ, నాగాయపల్లె, సోమాపురం, సీతారామాపురం, విశ్వనాథపురం, రాజువారిపేట, నక్కలదిన్నెలో రూ.25 నుంచి రూ.35 లక్షల చొప్పున కేటాయించి రామాలయాలను పునర్నిర్మించారు. అల్లాడుపల్లె వీరభద్ర స్వామి రథం కోసం రూ.72 లక్షలు మంజూరు చేశారు. వైఎస్ ప్రభుత్వ హయాంలో రూ.72 లక్షలతో వీరభద్రస్వామి దేవాలయాన్ని జీర్ణోద్ధరణ చేశారు.
- దువ్వూరు మండలంలోని పుల్లారెడ్డిపేటలో రూ. 50 లక్షలతో రామాలయం, నేలటూరులో రూ.35 లక్షలతో రామాలయాన్ని పునర్నిర్మించారు.
- బ్రహ్మంగారిమఠం మండలంలో రూ.8.50 కోట్లతో ఏడు చోట్ల దేవాలయాలను అభివృద్ధి చేశారు. బ్రహ్మంగారిమఠంలో రూ.1.50 కోట్లతో ఆలయాన్ని అభివృద్ధి చేశారు.



రూ.1.50 కోట్లతో అభివృద్ధి చెందిన బ్రహ్మంగారిమఠం

జమ్మలమడుగులో..



నారాపుర వెంకటేశ్వరస్వామి ఆలయం

జమ్మలమడుగు : జమ్మలమడుగులోని నారాపుర వెంకటేశ్వర స్వామి ఆలయ ఆధునీకరణకు రూ. కోటి 20 లక్షలు మంజూరు చేశారు. దీంతో ఆలయం చుట్టూ ప్రహరీ, ఆలయం ముందు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. రూ.40 లక్షలతో పెన్నానది ఒడ్డున ఉన్న జంబులింగేశ్వర ఆలయం జీర్ణోద్ధరణ చేశారు.

- ముద్దనూరు మండలంలోని నల్లబల్లె శివాలయం నిర్మాణం కోసం రూ.50 లక్షలు మంజూరు చేయడంతో ఆలయం జీర్ణోద్ధరణ చేశారు.
- పెద్దముడియం మండలంలోని పాలూరు చెన్న కేశవస్వామి ఆలయం కోసం రూ.35 లక్షలు మంజూరు చేయడంతో ఆలయ నిర్మాణం పునఃప్రతిష్ట చేశారు.

చెన్నకేశవాలయం.. సర్వాంగసుందరం



బద్వేలులో నూతన శోభను సంతరించుకున్న ఆదిచెన్నకేశవస్వామి ఆలయం

బద్వేలు అర్బన్ : గత ప్రభుత్వ హయాంలో విడుదల చేసిన నిధులతో బద్వేలు నియోజకవర్గానికి ఆధ్యాత్మిక పరిమళాలు తోడయ్యాయి. మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె గ్రామంలో గల పురాతన ఆదిచెన్నకేశవస్వామి ఆలయాన్ని రూ.98 లక్షల వ్యయంతో అభివృద్ధి చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే మండల పరిధిలోని లక్ష్మీపాలెం గ్రామంలో వెలసిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని రూ.64 లక్షలతో అభివృద్ధి చేశారు. విమాన గోపురం మరమ్మతులు, దక్షిణ గాలిగోపురం పునర్నిర్మాణం చేపట్టారు. వంద ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయ అభివృద్ధిని గతంలో ఎవరు కూడా పట్టించుకోలేదు. చరిత్ర కలిగిన ఆలయాన్ని అభివృద్ధి చేయడంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న స్వామివారి భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాజగోపురం. రాజసం

పులివెందుల టౌన్ : వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పులివెందులలోని పలు ఆలయాలకు మహర్దశ చేకూరింది. రూ.2.50 కోట్ల వ్యయంతో మిట్టమల్లేశ్వరస్వామి ఆలయ రాజగోపురం, తూర్పు ఆంజనేయస్వామి ఆలయ రాజగోపురం, ప్రహరీ , శ్రీరంగనాథ స్వామి ఆలయంలో కోనేరు, మండపం, తూర్పు ఆంజనేయస్వామి ఆలయంలో భావ నారాయణ స్వామి ఆలయం నిర్మాణం చేపట్టారు. రూ.60 లక్షల వ్యయంతో శ్రీ అంకాలమ్మ ఆలయ రాజ గోపురం చేపట్టారు.

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా రూ.3.85 కోట్లతో పురాతన, నూతన ఆలయాల నిర్మాణం చేపట్టారు. అందులో భాగంగా రూ.3.54 కోట్లతో భానుకోట క్షేత్రం పునఃనిర్మాణం చేపట్టారు.

వేముల : మండలంలో దేవదాయ శాఖ రూ.9.02కోట్ల నిధులతో పురాతన ఆలయాలను అభివృద్ధి చేశారు. మండలంలోని వేల్పులలో రూ.2 కోట్లతో భ్రమరాంబిక ఆలయం, చెన్నకేశవస్వామి ఆలయం, అంకాలమ్మ ఆలయాలను పునఃనిర్మించారు. గొందిపల్లెలో రూ.1.60 కోట్లతో శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం ప్రహరీ, శివాలయం, అంకాలమ్మ ఆలయాలు అభివృద్ధి చేశారు. పెర్నపాడులో రూ. కోటితో రామాలయం తోపాటు ప్రహరీ నిర్మించారు. వేముల, శేషన్న గారిపల్లెలో రూ.80 లక్షలతో రామాలయాలను అభివృద్ధి చేశారు. భూమయ్యగారిపల్లెలో కోటి రూపాయలతో లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని పునఃనిర్మించారు. గొల్లల గూడూరులో రూ.60 లక్షలతో అచ్చివెళ్లి గంగమ్మ ఆలయం, ప్రహరీ చేపట్టారు. చింతలజూటూరులో రూ.80 లక్షల తో అచ్చివెళ్లి గంగమ్మ ఆలయం, మెయిళ్లచెరువు గంగమ్మ గుడిని పునఃనిర్మించారు.

వేంపల్లె : వేంపల్లి మండలం నంది పల్లెలో కోటి రూపాయల సీజీఎఫ్ నిధుల కింద శివాలయం నిర్మాణ పనులు పూర్తిదశలో ఉన్నాయి. వేంపల్లిలో కోటి నిధులతో దుర్గమ్మ గుడిని నిర్మించనున్నారు. ఇడుపులపాయలోని మల్లెలమ్మ ఆలయానికి గత ప్రభుత్వం కోటి నిధులు మంజూరు చేయగా కాంట్రాక్టర్ నిర్మాణ పనులను చేపట్టకపోవడంతో ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసింది.



పులివెందులలోని మిట్టమల్లేశ్వరస్వామి ఆలయ రాజగోపురం

పొలతలకు ఆధ్యాత్మిక శోభ

వల్లూరు : కమలాపురం నియోజకవర్గంలో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో ఆలయాల అభివృద్ధి జరిగింది.

- పెండ్లిమర్రి మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పొలతలలోని పలు ఆలయాలను అభివృద్ధి చేశారు. రూ. 1 కోటితో అక్కదేవతల ఆలయ పునఃనిర్మాణ పనులు, రూ. 18,20,000 లతో బండెన్న స్వామి ఆలయ పునః నిర్మాణ పనులు, రూ. 22 లక్షలతో పుట్టాల ఆంజనేయ స్వామి ఆలయ పునః నిర్మాణ పనులు చేపట్టారు. రూ.2 కోట్ల ఆలయ నిధులతో రాజ గోపుర నిర్మాణ పనులు, రూ. 1. 4 కోట్ల వ్యయంతో ప్రధాన ఆలయ తూర్పు ప్రాకారం పొడిగింపు పనులను చేపట్టారు. రూ 8 లక్షల తో రథశాల నిర్మాణం, రూ .22 లక్షలతో దేవస్థాన కార్యాలయ నిర్మాణం, రూ. 38 లక్షలతో షాపింగ్ గదుల నిర్మాణం, రూ. 2.5 లక్షలతో గోశాల చుట్టూ ఫెన్సింగ్ పనులను చేపట్టారు. కాగా వైఎస్ జగన్ పాలనలో అప్పటి ఎమ్మెల్యే పి. రవీంద్రనాథరెడ్డి పొలతల మల్లేశ్వర స్వామి ఆలయానికి రూ. 30 లక్షల సొంత నిధులతో టేకు ఉడ్ రథాన్ని నిర్మించారు.
- వీఎన్ పల్లె మండలం సంగాలపల్లె వద్ద శ్రీ సప్తగిరి వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రూ. 75 లక్షల నిధులు మంజూరు చేశారు. సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద కళ్యాణ మండప నిర్మాణానికి రూ. 2 కోట్లు మంజూరు చేశారు.

ప్రొద్దుటూరులో వేదపాఠశాల

ప్రొద్దుటూరు/ ప్రొద్దుటూరు కల్చరల్/ రాజుపాళెం : వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రొద్దుటూరు నియోజకవర్గంలో పలు ఆలయాలకు మహర్దశ కలిగింది. రాజుపాళెం మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాల శ్రీ సంజీవరాయ స్వామి ఆలయానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఆలయ పునఃనిర్మాణానికి దేవాదాయ శాఖ కామన్ గుడ్ ఫండ్, కాంట్రిబ్యూషన్‌తో కలిపి రూ.3.55 కోట్లు మంజూరైంది. ఈ ఏడాది జనవరి 6వ తేదీన అప్పటి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు అంజనీ కుమారి, ఆలయ మాజీ చైర్మన్ కానాల విజయలక్ష్మితో కలిసి అందుకు సంబంధించి భూమిపూజ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

- అర్కటవేములలో రామాలయం నిర్మాణానికి రూ.10 లక్షలు, కూలూరులోని దద్దనాల గ్రామంలోని రామాలయానికి రూ.5 లక్షలు మంజూరయ్యాయి.
- ప్రొద్దుటూరు మండలంలోని బొజ్జవారిపల్లె కోదండరామ ఆలయ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.20 లక్షలు నిధులు మంజూరు చేసింది. ఈ ఆలయ నిర్మాణానికి అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న రాచమల్లు శివప్రసాదరెడ్డి రూ.5 లక్షలు విరాళం ఇచ్చారు. గ్రామస్తులు కూడా తమకు తోచినంత విరాళం వేసుకుని నిర్మాణం పూర్తి చేశారు. గత ఏడాది ఈ ఆలయాన్ని ప్రారంభించారు.



ప్రొద్దుటూరు అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో నిర్మించిన శైవాగమ వేదపాఠశాల

- ప్రొద్దుటూరు పట్టణంలోని బొల్లవరంలో వీరాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.16లక్షలు నిధులు మంజూరు చేశారు.
- రామేశ్వరంలోని మూలస్వామి ఆలయ నిర్మాణానికి రూ.8.50 కోట్లతో, ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి రూ.2.50 కోట్లతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతిపాదనలు పంపారు.

ప్రొద్దుటూరులో వేద పాఠశాల...

- ప్రొద్దుటూరు అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో రూ.1 కోటి 2 లక్షలతో అభివృద్ధి పనులు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగాయి. ఆలయానికి సంబంధించి శైవాగమ వేదపాఠశాలకు సొంత భవనం లేక గతంలో పక్కనే ఉన్న బిల్డింగ్‌లో నిర్వహించేవారు. అయితే ఇటీవల రూ.60 లక్షలతో వేద విద్యార్థులకు సౌకర్యవంతంగా నిర్మించారు.

ప్రజా వినతులకు గడువులోపు పరిష్కారం

జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజలు తమ సమస్యలపై సమర్పించే వినతులను పరిశీలించి గడువులోపు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆమె వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను వేగవంతంగా పరిష్కరించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

వినతులలో కొన్ని..

- చెన్నూరు మండలం రుద్రభారతిపేట రెవెన్యూ గ్రామంలో 349 ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు అనుమతి మంజూరు చేసేలా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని రాయలసీమ, ప్రకాశం జిల్లాల అగ్రిగోల్డ్ ప్లాట్స్ అండ్ హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్. ఈశ్వర్‌రెడ్డి, ఇతర ప్రజలు కోరారు.
- తనకు కారుణ్య నియామకం కింద ఉద్యోగ అవకాశం కల్పించాలని ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం కృష్ణంశెట్టిపల్లెకు చెందిన కె.వెంకటస్వామి కవిత కోరారు.
- ప్రభుత్వ భూమి, స్మశానాలు, చెరువులు ఆక్రమించి లే అవుట్లు వేసిన బుద్ధ రియల్ ఎస్టేట్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి కోరారు.
- రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఆర్‌హెచ్, ఈసీ నకలు, సెర్చ్ సర్వీసులు పొందేందుకు 30 శాతం అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఆర్‌టీఐ చైర్మన్ కోటపాటి లక్షుమయ్య ఫిర్యాదు చేశారు. ఫీజులకు సంబంధించి ఎలాంటి బోర్డులు ఏర్పాటు చేయడం లేదన్నారు. సర్వీసు కాపీలు తక్కువ నాణ్యతతో ఇస్తూ ప్రజలను ఇబ్బందులపాలు చేస్తున్నారని తెలిపారు.



వినతులు స్వీకరిస్తున్న జేసీ అదితిసింగ్

త్వరలో నూతన మద్యం పాలసీ అమలు

కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్ : త్వరలో నూతన మద్యం పాలసీ అమలు కానుందని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో మద్యం దుకాణాల పాలసీపై కలెక్టర్ సంబంధిత ఎక్సైజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024 సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాలను కేటాయించుటకు గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వబోతున్నదని చెప్పారు. ఇందులో భాగంగా జిల్లాలో 139 మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించబోతున్నామన్నారు. మద్యం దుకాణాలకు సంబంధించిన ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో దరఖాస్తులు చేసుకోవచ్చునన్నారు. కడప జిల్లాలో ఎక్సైజ్ స్టేషన్‌ల వారీగా కడప స్టేషన్–30, సిద్దవటం -8, ఎర్రగుంట్ల -14, జమ్మలమడుగు -14, ప్రొద్దుటూరు -19, పులివెందుల -16, ముద్దనూరు -7, మైదుకూరు -16, బద్వేలు -15 దుకాణాలు ఉన్నాయన్నారు. పూర్తి వివరాలను గజిట్ వచ్చిన తరువాత వివరిస్తామన్నారు. మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ కట్టుదిట్టంగా, పారదర్శకంగా జరగాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు, అసిస్టెంట్ కమిషనర్ చంద్ర శేఖర్ రెడ్డి, డిస్టిక్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ రవికుమార్, అసిస్టెంట్ డిస్టిక్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ వినోద్ కుమార్ నాయక్, కడప ఎక్సైజ్ సీఐ కృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాల స్వీకరణ..

స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాల స్వీకరణ చేపడుతున్నామని, ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి కోరారు. కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అక్టోబర్ 1వ తేదీ సాయంత్రం 5 గంటలకు స్థానిక రాజీవ్ పార్కులో ప్లాస్టిక్ వ్యర్థాల స్వీకరణ కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛతపై అవగాహన కలిగి మన పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అంతకుముందు ప్లాస్టిక్ వ్యర్థాల స్వీకరణ పోస్టర్లను కలెక్టర్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

క్లుప్తంగా

గ్రావెల్‌ మట్టి తరలిస్తున్న టిప్పర్‌ పట్టివేత


గ్రావెల్‌ మట్టిని తరలిస్తున్న టిప్పర్‌

ఎర్రగుంట్ల : మండల కేంద్రమైన ఎర్రగుంట్ల పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో నుంచి అక్రమంగా గ్రావెల్‌ మట్టిని తరలిస్తున్న టిప్పర్లను ఎర్రగుంట్ల పోలీసులు పట్టుకున్నారు. మండల పరిధిలోని వై.కోడూరు, కమలాపురం మండలాల పరిధిలోని తురకపల్లి గ్రామ సరిహద్దులలో నుంచి కొండలను తవ్వి అక్రమంగా గ్రావెల్‌ ఎర్రమట్టిని టిప్పర్లు, ట్రాక్టర్ల సాయంతో తరలిస్తున్నారు. టిప్పరు మట్టిని రూ.5 వేలకు పైగానే విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎర్రగుంట్ల మీదుగా ముద్దనూరు వైపు వెళుతున్న టిప్పర్లను పోలీసులు పట్టుకున్నారు.

మీ సేవలు చిరస్మరణీయం


పదవీ విరమణ పొందిన పోలీసులను సన్మానిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్‌) కె. ప్రకాష్‌బాబు

కడప అర్బన్‌ : దాదాపు 35 సంవత్సరాల పాటు అంకితభావంతో పోలీసు శాఖకు అందించిన సేవలను శాఖ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్‌) కె. ప్రకాష్‌బాబు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్‌ రాజు ఆదేశాల మేరకు సోమవారం స్థానిక జిల్లా పోలీస్‌ కార్యాలయంలో సెప్టెంబర్‌ నెలాఖరున పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను అదనపు ఎస్పీ ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ కుటుంబ జీవితాన్ని త్యాగం చేసి నిబద్ధతతో విధులు నిర్వర్తించినందుకు పోలీసు శాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. పదవీ విరమణ తరువాత కుటుంబ సభ్యులతో గడుపుతూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ ఏఓ జ్యోతి, ఆర్‌ఐ టైటస్‌, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్‌, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్‌ పాల్గొన్నారు. పదవీ విరమణ సన్మానం పొందిన వారిలో డీటీఆర్‌బీ ఎస్‌ఐ బి. ప్రదీప్‌కుమార్‌, ప్రొద్దుటూరు ఒన్‌టౌన్‌ ఏఎస్‌ఐ జె. శివశంకర్‌ ఉన్నారు.

ప్రభుత్వ స్థలం అన్యాక్రాంత యత్నం


ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు స్తంభాలు దింపిన దృశ్యం

సిద్దవటం : మండలంలోని శాఖరాజుపల్లె రెవెన్యూ గ్రామం సర్వే నంబర్‌ 425/1లోని 10 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని అన్యాక్రాంతం చేసేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారు. మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెనుక భాగంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో కొంతమంది కంచె వేసేందుకు అక్కడక్కడా స్తంభాలు దింపారు. వీఆర్‌ఓ ప్రభాకర్‌రెడ్డిని వివరణ కోరగా ఈ విషయాన్ని తహసీల్దార్‌ దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి సిద్దవటం పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారన్నారు.

ఎనిమిది దుకాణాలకు జరిమానా

రాయచోటి (జగదాంబసెంటర్‌) : నాసిరకం ఆహార పదార్థాలను ప్రజలకు అమ్మడం, అలాగే ఆహార పదార్థాలను వేయించడానికి వంటనూనెను మూడు సార్లకు మించి మళ్లీ ఉపయోగించిన నేరానికి రాయచోటి పట్టణంలోని ఎనిమిది దుకాణాలకు జరిమానా విధించినట్లు జిల్లా ఆహార భద్రతా అధికారి డాక్టర్‌ కె.షమీమ్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాపారస్తులు నాసిరకం ఆహార పదార్థాలను ప్రజలకు అమ్మితే ఆహార భద్రతా ప్రమాణాల చట్టంలో నిర్దేశించిన ప్రకారం రూ.5 లక్షల వరకు అపరాధం విధిస్తారని తెలిపారు.

నిందితులకు జెలిటిన్‌ స్టిక్స్‌ ఎక్కడివో.?

- వీఆర్‌ఏ హత్య కేసులో అన్ని కోణాల్లో దర్యాప్తు
- మైనింగ్‌లోకి పనులకు వెళుతున్న నిందితులు
- ఆ దిశగా విచారణ ముమ్మరం


సంఘటన స్థలం వద్ద క్లూస్‌ టీంతో చర్చిస్తున్న సీఐ, ఎస్‌ఐలు


పాడుబడ్డ ఇంటిలో నుంచి జెలిటిన్‌ స్టిక్స్‌ పేల్చేందుకు ఉపయోగించిన ఎక్స్‌ప్లోడర్‌

సాక్షి టాస్క్‌ఫోర్స్‌ : వేముల మండలంలోని వి.కొత్తపల్లె గ్రామంలో వీఆర్‌ఏ నరసింహులును హత్య చేసేందుకు ఉపయోగించిన జెలిటిన్‌ స్టిక్స్‌ ఎక్కడ నుంచి వచ్చాయోనని పోలీసులు ఆరా తీస్తున్నారు. మామూలుగా జెలిటిన్‌ స్టిక్స్‌ను ముగ్గురాయి మైనింగ్‌లలో పేల్చేందుకు ఉపయోగిస్తారు. ఇవి నిందితుల వద్దకు ఎలా వచ్చాయన్న దానిపై ప్రజలలో చర్చ నడుస్తోంది. కాగా వేముల, వేంపల్లె మండలాల్లో కొంతమంది టీడీపీ నాయకులు అక్రమ ముగ్గురాయి మైనింగ్‌ల కార్యకలాపాలు ప్రారంభించారు. ముగ్గురాయి మైనింగ్‌లలో జెలిటిన్‌ స్టిక్స్‌ను ఎక్కువగా ఉపయోగిస్తారు. అక్రమ ముగ్గురాయి మైనింగ్‌లలో కూలి పనులకు నిందితులు బాబు, రమేష్‌లు వెళుతున్నారు. మామూలుగా లీజు ఉన్న ముగ్గురాయి మైనింగ్‌లలో జెలిటిన్‌ స్టిక్స్‌ను ఉపయోగించి పనులు చేస్తుంటారు. అయితే అక్రమ ముగ్గురాయి మైనింగ్‌లకు జెలిటిన్‌ స్టిక్స్‌ ఎక్కడి నుంచి సరఫరా అవుతున్నాయన్న విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. లైసెన్స్‌ ఉన్న వారు మాత్రమే జెలిటిన్‌ స్టిక్స్‌ను వాడుకుంటారు. అలా కాకుండా ఎలాంటి అనుమతులు లేకుండా ముగ్గురాయి మైనింగ్‌లలో పనులు చేసేందుకు జెలిటిన్‌ స్టిక్స్‌ను ఉపయోగిస్తున్నారు. మైనింగ్‌లోకి పనులకు వెళుతున్న బాబు జెలిటిన్‌ స్టిక్స్‌ను తెచ్చుకున్నాడా అనే విషయాలపై పోలీసులు విచారణ చేస్తున్నారు. ముగ్గురాయి మైనింగ్‌లలో ఉపయోగిస్తున్న జెలిటిన్‌ స్టిక్స్‌ బాబు చాటుమాటుగా తెచ్చుకుని వీఆర్‌ఏ నరసింహులును హత్య చేసేందుకు ఉపయోగించాడా లేక ఎక్కడైనా కొనుగోలు చేసి తీసుకొచ్చాడా అనే కోణంలో పోలీసులు లోతుగా విచారణ చేస్తున్నారు. ఆదివారం రాత్రి వీఆర్‌ఏ నరసింహులును జెలిటిన్‌ స్టిక్స్‌తో పేల్చడంతో అప్రమత్తమైన పోలీసులు రాత్రికి రాత్రే వాటిపై ఆరా తీసినట్లు తెలుస్తోంది. వీఆర్‌ఏను హత్య చేసేందుకు ఉపయోగించిన జెలిటిన్‌ స్టిక్స్‌ నటరాజన్‌ కంపెనీకి చెందినవిగా సమాచారం. మృతి చెందిన వీఆర్‌ఏ నరసింహులు వేంపల్లెలోని ముగ్గురాయి పనులకు, పోలీసుల అదుపులో ఉన్న నిందితులలో ఒకరు పెండ్లిమర్రి మండలం రాజుపాలెం గ్రామ సమీపంలోని ముగ్గురాయి మైనింగ్‌ పనులకు, మరొకరు వేముల మండలంలో జరుగుతున్న మైనింగ్‌లలో కూలి పనులకు వెళుతున్నారు. ఇప్పటికే వేంపల్లె మండలానికి చెందిన టీడీపీ నాయకుడిని పోలీసులు జెలిటిన్‌ స్టిక్స్‌కు సంబంధించి ఆరా తీసినట్లు తెలుస్తోంది. అయితే ఆదివారం రాత్రి సంఘటన జరిగిన వెంటనే పోలీసులు రాజుపాలెం గ్రామంలోని మైనింగ్‌ వద్ద జెలిటిన్‌ స్టిక్స్‌ను పరిశీలించగా.. అవి నటరాజన్‌ కంపెనీకి చెందినవి కాదని నిర్ధారించినట్లు సమాచారం. నటరాజన్‌ కంపెనీకి చెందిన జెలిటిన్‌ స్టిక్స్‌ ఏ ముగ్గురాయి మైనింగ్‌లలో వాడుతున్నారనే దానిపై పోలీసులు ముమ్మరంగా విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. నిందితుడు బాబును వీఆర్‌ఏ హత్యకు ఉపయోగించిన జెలిటిన్‌ స్టిక్స్‌ ఎక్కడ నుంచి తీసుకొచ్చావని పోలీసులు విచారిస్తున్నా సరైన సమాధానం చెప్పలేదని తెలుస్తోంది.

నిలిచిపోయిన మైనింగ్‌ కార్యకలాపాలు..

వేముల మండలంలోని వి.కొత్తపల్లె గ్రామంలో ఆదివారం రాత్రి జెలిటిన్‌ స్టిక్స్‌ను పేల్చి వీఆర్‌ఏను హత్య చేసిన సంఘటన జరగడంతో అప్రమత్తమైన మైనింగ్‌ నిర్వాహకులు పనులను నిలిపివేసినట్లు తెలుస్తోంది. వేముల, వేంపల్లె మండలాల్లో ముగ్గురాయి మైనింగ్‌ పనులు సోమవారం నిలిపివేశారు. హత్య చేసేందుకు ఉపయోగించిన జెలిటిన్‌ స్టిక్స్‌పై పోలీసులు ఆరా తీస్తుండటంతో నిర్వాహకులు పనులను నిలిపివేసినట్లు సమాచారం.

పథకం ప్రకారమే హత్య

వేముల : వేముల మండలం వి.కొత్తపల్లె గ్రామంలో ఆదివారం రాత్రి జెలిటిన్‌ స్టిక్స్‌ పేలుడుతో హత్య చేసిన సంఘటన ఓ పథకం ప్రకారం జరిగినట్లు తెలుస్తోంది. గ్రామంలో నరసింహులు వీఆర్‌ఏగా ఉంటూ ముగ్గురాయి పనులకు వెళ్లేవాడు. అలాగే బాబు, రమేష్‌ అనే ఇరువురు కూడా ముగ్గురాయి పనులకు వెళ్లేవారు. ఈ క్రమంలో వీఆర్‌ఏ నరసింహులు భార్య సుబ్బలక్ష్మితో బాబు వివాహేతర సంబంధం పెట్టుకున్నట్లు తెలుస్తోంది. వీరి మధ్య వివాహేతర సంబంధంపై తరుచూ గొడవలు జరుగుతుండగా గ్రామంలోని పెద్ద మనుషులు పంచాయితీ చేసి సర్దిచెప్పేవారు. అయితే గత కొన్నాళ్లుగా సుబ్బలక్ష్మి బాబుతో వివాహేతర సంబంధానికి నిరాకరించింది. మృతుని కుటుంబ సభ్యులు గతంలో బాబును ఈ విషయంపై మందలించారు. వీటన్నింటిని మనస్సులో పెట్టుకున్న బాబు నరసింహులును ఎలాగైనా హత్య చేయాలని పథకం రచించాడు. ఆదివారం రాత్రి గ్రామ సమీపంలోని పీబీసీ కాలువ గట్టుపైన బాబు, రమేష్‌లు మద్యం సేవించారు. అక్కడ నుంచి గ్రామానికి చేరుకున్న బాబు రాత్రి పొద్దుపోయాక జిలెటిన్‌ స్టిక్స్‌ను వైరుకు అమర్చి పాడుబడ్డ ఇంటిలో ఎక్స్‌ప్లోడర్‌కు అనుసంధానం చేసి పేల్చి వేసినట్లు తెలుస్తోంది. ఈ సంఘటనకు సంబంధించి బాబు, రమేష్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వివాహేతర సంబంధంవల్లే వీఆర్‌ఏ హత్య : పులివెందుల డీఎస్పీ మురళి నాయక్‌



పులివెందుల రూరల్‌ : వివాహేతర సంబంధంవల్లే వీఆర్‌ఏ వై.నరసింహులును హత్య చేసినట్లు పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్‌ తెలిపారు. సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేముల మండలం వి.కొత్తపల్లి గ్రామానికి చెందిన వీఆర్‌ఏ నరసింహులు, భార్య సుబ్బలక్షుమ్మలకు ముగ్గురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. వీరు రోజు మాదిరిగానే ఇంటి ముందు మంచంపై పడుకున్నారు. మరొక గదిలో పిల్లలు పడుకొని ఉన్నారు. బాగా నిద్రపోయే సమయంలో జిలెటిన్‌ స్టిక్స్‌ మంచానికి అమర్చి బ్యాటరీ సాయంతో పేల్చారు. దీంతో నరసింహులు, సుబ్బలక్షుమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తీసుకెళ్తుండగా నరసింహులు మార్గమధ్యంలో మృతి చెందాడు. సుబ్బలక్షుమ్మను కడప రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. వీఆర్‌ఏ నరసింహులు మృతికి వివాహేతర సంబంధమే కారణమై ఉండవచ్చని తెలిపారు. ఇతర కోణాల్లో కూడా విచారణ చేపట్టి నిందితులను పట్టుకుంటామని ఆయన తెలిపారు.

అడవి పందిపై దాడి

చాపాడు : మండల పరిధిలోని చియ్యపాడు గ్రామ సమీపంలోని మొక్కజొన్న పంటలో అడవి పందిపై దాడి చేసిన ముగ్గురు వ్యక్తులను సోమవారం ఉదయం వనిపెంట రేంజ్‌ ఫారెస్ట్‌ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పొలంలో అడవి పందిపై దాడి చేసి దానిని పట్టుకుని మాంసంగా చేయగా ఫారెస్ట్‌ అధికారులు ఈ ఘటనకు పాల్పడిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

హత్యాయత్నం ఘటనలో కేసు నమోదు

చాపాడు : మండలంలోని నాగులపల్లెకు చెందిన మల్లికార్జునరెడ్డి అనే వ్యక్తిని కారుతో ఢీ కొట్టి చంపేందుకు ప్రయత్నించిన ఘటనలో ఇదే గ్రామానికి చెందిన సానా విద్యా సాగర్‌ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో మల్లికార్జునరెడ్డి బైక్‌లో నాగులపల్లెకు వెళుతుండగా వెనకాల బొలెరో వాహనంతో వస్తున్న విద్యా సాగర్‌ రెడ్డి బైక్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎనిమిదేళ్ల క్రితం మల్లికార్జునరెడ్డి కూతురిని విద్యాసాగర్‌రెడ్డి వివాహం చేసుకున్నాడు. గత కొన్ని నెలలుగా వీరి కుటుంబాల మధ్య గొడవలు జరిగి మనస్పర్ధలు ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వివాదాస్పద వ్యాఖ్యలు తగదు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల (అట్లూరు) : ముఖ్యమంత్రి చంద్రబాబు తన స్వార్థం కోసం తిరుమల లడ్డూపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం తగదని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి హితవు పలికారు. సోమవారం పోరుమామిళ్ల పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు వ్యాఖ్యలను సుప్రీంకోర్టు కూడా తీవ్రంగా పరిగణించిందన్నారు. బీజేపీ నేత పురందేశ్వరి డిక్లరేషన్‌ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. శ్రీవారి లడ్డూ వ్యవహారంలో వాస్తవాలు వెలుగు చూసేలా విచారణ చేయించాలని కోరారు. మాజీ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి మొదటి నుంచి ఈ అంశంపై ఆచితూచి మాట్లాడుతున్నారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి


లక్ష్మయ్య, (ఫైల్‌)


సంఘటన స్థలంలో తీవ్రగాయాలతో పడి ఉన్న ఉపాధ్యాయుడు

పెండ్లిమర్రి : కడప-పులివెందుల ప్రధాన రహదారిలోని యోగి వేమన యూనివర్సిటీ సమీపంలో సోమవారం పంది అడ్డు రావడంతో జరిగిన ప్రమాదంలో ఉపాధ్యాయుడు లక్ష్మయ్య(51) మృతి చెందారు. స్థానికుల కథనం మేరకు... కడపకు చెందిన ఉపాధ్యాయుడు లక్ష్మయ్య పెండ్లిమర్రి జిల్లా పరిషత్‌ హైస్కూల్‌లో తెలుగు పండితుడుగా విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం కడప నుంచి పెండ్లిమర్రి హైస్కూల్‌కు ద్విచక్ర వాహనంలో వస్తుండగా వైవీయూ వద్ద పంది అడ్డురావడంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి పందిని ఢీకొని కింద పడ్డారు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతదేహానికి ఎంఈఓ సుజాత, ఉపాధ్యాయులు నివాళి అర్పించారు.

సర్వాయపల్లె జీవిత ఖైదీలకు రెడ్యం పరామర్శ


కడప కేంద్ర కారాగారంలో జీవితఖైదీలను కలిసి వస్తున్న రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

కడప అర్బన్‌ : మైదుకూరు పట్టణ పరిధిలోని సర్వాయపల్లెకు చెందిన బీచుపల్లి పుల్లారెడ్డి హత్య కేసులో 12 మంది ముద్దాయిలకు ప్రొద్దుటూరు రెండవ అదనపు జిల్లా జడ్జి యావజ్జీవ శిక్షతో పాటు, జరిమానా విధించారు. వీరిలో ములుపాక పిచ్చిరెడ్డి అలియాస్‌ జంగంరెడ్డి, జంగంరెడ్డి నడిపి సుబ్బారెడ్డి, తవ్వా యర్రయ్యగారి ఓబుల్‌రెడ్డి, తవ్వా ఎర్రయ్యగారి లక్ష్మిరెడ్డి, జంగంరెడ్డి వీరారెడ్డి, జంగంరెడ్డి సుధాకర్‌రెడ్డి, జంగం రెడ్డి సూర్యనారాయణ రెడ్డి, జంగంరెడ్డి పెద్ద సుబ్బారెడ్డి, తవ్వా మునీంద్రారెడ్డి, ములపాక సువిగారి సుబ్బారెడ్డి, జంగంరెడ్డి రామసుబ్బారెడ్డి, జంగంరెడ్డి వెంకట సుబ్బారెడ్డి ఉన్నారు. వీరిని అదే రోజు కడప కేంద్ర కారాగారానికి తరలించారు. సోమవారం ఉదయం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు, ఏపీఎస్‌ ఆర్టీసీ మాజీ జోనల్‌ చైర్మన్‌ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, ఖాజీపేట మండలం చెన్నముక్కపల్లి మాజీ సర్పంచ్‌ తవ్వా రామిరెడ్డి యావజ్జీవ ఖైదీల బంధువులతో కలిసి కడప కేంద్ర కారాగారంలో వారిని పరామర్శించారు. ఓదార్చి ధైర్యం చెప్పారు. వారికి పూర్తి స్థాయిలో అండగా ఉంటామని భరోసా కల్పించారు.

రూట జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక


జాకీర్‌ హుస్సేన్‌ (అధ్యక్షుడు)


జుబేర్‌ అహ్మద్‌ (ప్రధాన కార్యదర్శి)


కరామతుల్లా (కోశాధికారి)

కడప ఎడ్యుకేషన్‌ : రాష్ట్ర ఉర్దూ టీచర్స్‌ అసోసియేషన్‌(రూట) వైఎస్సార్‌ జిల్లా నూతన శాఖను ఎన్నుకున్నారు. సోమవారం కడప కాగితాలపెంట జిల్లా పరిషత్తు ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఈ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో జిల్లా అధ్యక్షుడిగా జాకీర్‌ హుస్సేన్‌, ప్రధాన కార్యదర్శిగా జుబేర్‌ అహ్మద్‌, జిల్లా కోశాధికారిగా కరామతుల్లా, జిల్లా అసోసియేట్‌ అధ్యక్షుడిగా హబీబుల్లా, ఖాదర్‌బాషా, మునీం సాహెబ్‌, వైస్‌ ప్రెసిడెంట్‌లుగా అలీఅక్బర్‌, ముజీమ్‌, అస్లాం, అదనపు ప్రధాన కార్యదర్శులుగా ముహమ్మద్‌ దావూద్‌, జిలానీబాషా, ఫైరోజ్‌బాషా, కార్యదర్శులుగా వలియ్యుల్‌ ఖయ్యూం, మహమ్మద్‌అలీ, అబ్దుల్‌ బాసిత్‌లను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రూట రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్‌ సిరాజుద్దీన్‌, ఎన్నికల పరిశీలకుడిగా రాష్ట్ర కన్వీనర్‌ అఫ్జల్‌ బాషా వ్యవహరించారు.

11 మంది ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

- పరారీలో ప్రధాన నిందితుడు
- 12 దుంగలు, ఆటో స్వాధీనం


ఎర్రచందనం స్మగ్లర్ల వివరాలను వెల్లడిస్తున్న కడప అటవీశాఖ రేంజ్‌ అధికారి కె. ప్రసాద్‌

కడప అర్బన్‌ : వైఎస్‌ఆర్‌ జిల్లాలోని చింతకొమ్మదిన్నె మండలం మద్దిమడుగు సెక్షన్‌ రసూల్‌పల్లి బీట్‌ ప్రాంతంలో ఎర్రచందనాన్ని ఆటోలో లోడింగ్‌ చేస్తున్న 11 మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్ట్‌ చేశామని కడప ఫారెస్ట్‌ రేంజ్‌ ఆఫీసర్‌ కె. ప్రసాద్‌ తెలిపారు. సోమవారం కడప నగరం చెన్నూరు బస్టాండ్‌ సమీపంలోని కడప రేంజ్‌ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం వంగిమల గ్రామానికి చెందిన ముక్కెర వెంకటరామిరెడ్డి అనే ఆటో డ్రైవర్‌తో పాటు మరో 10 మంది మద్దిమడుగు అటవీ ప్రాంతంలోకి వెళ్లి అక్కడ ఎర్రచందనం చెట్లు నరికి వాటిని దుంగలుగా మార్చారన్నారు. ఆదివారం రాత్రి 12 ఎర్రచందనం దుంగలు ఆటోలో లోడింగ్‌ చేసి రవాణాకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం వచ్చిందన్నారు. జిల్లా అటవీశాఖాధికారి సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ప్రధాన నిందితుడైన వెంకటరామిరెడ్డి పరారయ్యాడని అతని కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అన్నమయ్య జిల్లా రాచపల్లిలోని వంగిమల్లకు చెందిన రాయచోటి రామ, రాయచోటి రాచన్న, శ్రీనివాసులు, షేక్‌ అల్లాబకాష్‌, గట్టుపల్లి వెంకటరమణ, రాయచోటి రాచరాయుడు, శేఖర్‌, షేక్‌షావలి, గంగనేరు నీలకంఠరావు, షేక్‌ అల్లా, షేక్‌ షఫీవుల్లా, రాచరాయుడులను అరెస్ట్‌ చేశామన్నారు. వారి వద్ద నుంచి 12 ఎర్రచందనం దుంగలు, ఆటోను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ప్రధాన నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

అంతర్‌ జిల్లాల క్రీడాపోటీలకు సన్నద్ధం కావాలి

కడప స్పోర్ట్స్‌ : ఎస్‌జీఎఫ్‌ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్‌ జిల్లాల క్రీడా పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లు వివిధ ప్రాంతాల్లో నిర్వహించే పోటీల్లో పాల్గొనేందుకు సంసిద్ధులై ఉండాలని ఎస్‌జీఎఫ్‌ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి తెలిపారు. ఫిజికల్‌ డైరెక్టర్లు 4 సెట్ల ఒరిజినల్‌ ఎలిజిబిలిటీ ఫారమ్స్‌తో హాజరుకావాలని సూచించారు. అక్టోబర్‌ 2వ తేదీన విజయవాడ సమీపంలోని జెడ్పీహైస్కూల్‌లో అండర్‌-14 బాలబాలికలు, అండర్‌-17 బాలుర పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్‌ 1వతేదీ సాయంత్రం లోపు ఒరిజినల్‌ ఎలిజిబిలిటీ ఫారమ్స్‌తో కడప నగరంలోని నగరపాలక ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలకు చేర్చాలన్నారు. అదే విధంగా అక్టోబర్‌ 5న అండర్‌-14, అండర్‌-17 బాలబాలికలకు తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్‌ కాంప్లెక్స్‌లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 3వ తేదీ సాయంత్రం క్రీడాకారులు కడప ఉర్దూ బాలుర హైస్కూల్‌లో హాజరు కావాలని సూచించారు. 6వ తేదీన హ్యాండ్‌బాల్‌ పోటీలు రాజమండ్రిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే అండర్‌-17 బాలురు 4వ తేదీ సాయంత్రం లోపు కడప నగరంలోని నగరపాలక ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలకు చేరుకోవాలన్నారు. రైఫిల్‌ షూటింగ్‌ అండర్‌-14, అండర్‌-17 జట్లకు రాజమండ్రిలో అంతర్‌ జిల్లాల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 16వ తేదీ సాయంత్రం మున్సిపల్‌ హైస్కూల్‌ ఉర్దూ బాలుర పాఠశాలలో హాజరు కావాలని కోరారు.

9 ఎక్సైజ్‌ స్టేషన్లకు సీఐల నియామకం

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : జిల్లాలోని 9 ఎక్సైజ్‌ స్టేషన్లకు సీఐలను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం సెబ్‌ను ఎక్సైజ్‌లో విలీనం చేసిన నేపథ్యంలో వీరికి సీఐలుగా పోస్టింగులు ఇచ్చారు.

ప్రాంతం	సీఐ పేరు
కడప	బి. కృష్ణకుమార్‌
సిద్దవటం	రాజశేఖర్‌
ఎర్రగుంట్ల	ఎ. గోపికృష్ణ
జమ్మలమడుగు	సరితారెడ్డి
ప్రొద్దుటూరు	సీవీ సురేంద్రారెడ్డి
పులివెందుల	చెన్నారెడ్డి
ముద్దనూరు	విన్నీలత
మైదుకూరు	ధీరజ్‌రెడ్డి
బద్వేలు	సీతారామిరెడ్డి

వైద్య రంగాన్ని మరింత పటిష్టం చేస్తున్నాం


మినీ ఆడిటోరియం ప్రారంభిస్తున్న మంత్రి

కడప అర్బన్‌ : వైద్య ఆరోగ్య రంగాన్ని, వైద్య విద్యను మరింత పటిష్టం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్‌ పేర్కొన్నారు. సోమవారం కడప రిమ్స్‌ జీజీహెచ్‌ ఆవరణంలో ప్రభుత్వ దంతవైద్య కళాశాలలో రూ. 14 లక్షలతో అభివృద్ధి చేసిన మినీ ఆడిటోరియం, ఎమర్జెన్సీ డెంటల్‌ క్లినిక్‌, సెంట్రల్‌ ల్యాబ్‌లో రూ. 2 లక్షలతో ఏర్పాటు చేసిన అధునాతన పరికరాలను అలాగే రిమ్స్‌ సూపర్‌ స్పెషాలిటీ బ్లాకులో రూ. 6 కోట్లకు పైగా వెచ్చించి నూతనంగా ఏర్పాటు చేసిన క్యాథ్‌లాబ్‌ సెంటర్‌ను ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌ రెడ్డి, కడప ఎమ్మెల్యే ఆర్‌. మాధవిరెడ్డి, జేసీ అదితిసింగ్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం దంతవైద్య కళాశాల మినీ ఆడిటోరియంలో మంత్రి మాట్లాడుతూ దశల వారీగా రాష్ట్రంలో ఇప్పటికే మంజూరైన వైద్య కళా శాలలను పూర్తి చేసి ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ వైద్య సంచాలకుడు డాక్టర్‌ శ్రీనివాసులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్‌ నాగరాజు, రిమ్స్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ రమాదేవి, ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఏ. సురేఖ, సూపర్‌ స్పెషాలిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఎం. సురేశ్వర్‌రెడ్డి, డీసీహెచ్‌ఎస్‌ డాక్టర్‌ హిమదేవి, దంతవైద్య కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ జ్యోత్స్న పాల్గొన్నారు.

రూ. 20 కోట్లతో జిల్లా ఆస్పత్రిలో మౌలిక సదుపాయాల కల్పన

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులో మెడికల్‌ కాలేజీ ఏర్పాటు చేయాలనేది ఇక్కడి ప్రజల చిరకాలవాంఛ అని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ తెలిపారు. మంత్రి సత్యకుమార్‌, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిలు సోమవారం జిల్లా ఆస్పత్రిని సందర్శించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : జిల్లాలో బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి వై.సత్యకుమార్‌ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జిల్లా వెనుకబడి ఉందని, ప్రతి ఒక్కరూ బీజేపీలో చేరాలని సూచించారు. నాయకులు బాలకృష్ణ యాదవ్‌, భానుప్రకాశ్‌, బొమ్మన సుబ్బరాయుడు, ఆదూరి శారదమ్మ తదితరులు మాట్లాడారు.

